క్లుప్తంగా

అమ్మవారి పసుపు, కుంకుమ పంపిణీ



లలిత సహస్ర నామ పారాయణ చేస్తున్న మహిళలు

యలమంచిలి: గ్రామ దేవత పుంతల ముసలమ్మ అమ్మవారికి శ్రావణ మాసంలో జరిగిన పూజలో వినియోగించిన పసుపు, కుంకుమలను ఆదివారం మహిళలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు ఆలయ ప్రాంగణంలో కూర్చుని లలిత సహస్ర నామ పారాయణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

గౌడ సంఘ సమావేశం



సమావేశంలో పాల్గొన్న నాయకులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక మార్కెట్ యార్డ్‌లో గౌడ సంఘ సమావేశం ఆదివారం నిర్వహించారు. ముందుగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్, గౌతు లచ్చన్న చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ ఏడాది కార్తీక వన సమారాధనకు జరపడానికి చర్చించి నిర్ణయం తీసుకున్నారు. పాలకొల్లు పట్టణ గౌడ్ అభివృద్ధి సంఘం, అచ్చుగట్లపాలెం గౌడ సేన సభ్యులు పాల్గొన్నారు

బాధితులకు సాయం అందజేత



సాయం అందిస్తున్న మానవత సభ్యులు

పెనుగొండ: ఆపదలో ఉన్న పలువురికి పెనుగొండ మానవత సంస్థ ఆదివారం ఆర్థిక సహాయం చేసింది. పెనుగొండ ఆక్స్‌ఫర్డ్ స్కూలు ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో వినికిడి లోపంతో పుట్టిన కవల పిల్లల వైద్యానికిగానూ తుళ్లూరి హేమలతకు మానవత తరఫున రూ.10 వేలు, ఆక్స్‌ఫర్డు స్కూల్ తరఫున రూ.10 వేలు సహాయం అందించారు. ఇటీవల జరిగిన్న అగ్నిప్రమాదంలో రోడ్డు పాలైన జాన్సన్ కుటుంబానికి రూ.10 వేలు సహాయాన్ని మానవత మండల అధ్యక్షుడు కొమ్ముల రామకృష్ణ చెక్కుల ద్వారా అందించారు. కార్యక్రమంలో కర్రి నరేంద్ర రెడ్డి, నూలి పవన్, తాడి రమేష్, బచ్చు నరసింహమూర్తి, పలివెల శ్రీను తదితరులులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

యలమంచిలి: మేడపాడు గ్రామంలోని నిరుపేద కుటుంబాలకు గడచిన ఐదేళ్లుగా హోప్ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు ప్రతి నెలా నిరు పేదలు, వృద్ధులకు నెలకు సరిపడ నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం గ్రామంలో గొంతు క్యాన్సర్ కారణంగా గత కొంతకాలంగా పనికి వెళ్లక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న కొప్పిశెట్టి సూరయ్య కుటుంబానికి ఈ నెల నుంచి కొత్తగా నిత్యావసరాలు పంపిణీ ప్రారంభించినట్లు సంస్థ ప్రతినిధి ముద్దల రాధాకృష్ణ తెలిపారు. సొసైటీ మాజీ అధ్యక్షులు ఓదూరి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా ఈ నెల సరుకులు పంపిణీ చేసినట్లు రాధాకృష్ణ తెలిపారు.

మళ్లీ నరసాపురం జిల్లా కేంద్ర ఉద్యమం

నరసాపురం: నరసాపురంలో జిల్లా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ మళ్లీ పోరాడదామని స్థానిక నేతలు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే బి.నాయకర్ కార్యాలయంలో ఈ అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నేత బి.మాధవనాయుడు, బీజేపీ, కాంగ్రెస్, సీపీఐ నేతలు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తామని నరసాపురం ఆర్డీఓ దాసి రాజు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ప్రజలు తమ ఫిర్యాదులను ఉదయం 10.30 గంటల నుంచి అందించాలని కోరారు.

మానవత నూతన కార్యవర్గం

వీరవాసరం: మానవత వీరవాసరం మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు. చైర్మన్‌గా మల్ల రాంబాబు, ప్రెసిడెంట్‌గా యరకరాజు చినబాబు, సెక్రటరీగా కోటిపల్లి బాబు, ట్రెజరర్‌గా గులిపల్లి కిరణ్, వైస్ ప్రెసిడెంట్‌గా గంధం ఏసుబాబు ఎంపికయ్యారు. కార్యక్రమంలో మానవత జిల్లా అధ్యక్షుడు కండెపు సూర్యనారాయణ, కార్యదర్శి భోగవల్లి వెంకట సుబ్బారావు, స్టేట్ కన్వీనర్ సాగిరాజు జానకిరామరాజు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నరసాపురంలో పారిశుద్ధ్యం అధ్వానం

- పట్టణంలో ఎక్కడ చూసినా పిచ్చిమొక్కలే
- పూడుకుపోయిన డ్రెయిన్స్
- పట్టించుకోని అధికారులు



బీజీబీఎస్ మహిళా కళాశాల రోడ్డులో పిచ్చి మొక్కలు పెరిగిపోయిన దృశ్యం



అయ్యప్పస్వామి గుడి వద్ద మురుగుపారక అధ్వానంగా ఉన్న డ్రెయిన్

నరసాపురం: నరసాపురం మున్సిపాలిటీలో వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా తయారైంది. పట్టణంలో మొత్తం 48 వరకూ మురికివాడలు ఉన్నాయి. ఈ మురికివాడల్లో పారిశుద్ధ్య నిర్వహణ మరింత అధ్వానంగా ఉంది. దీనికి తోడు పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థ సవ్యంగా లేకపోవడం పరిస్థితిని మరింత దిగజారుస్తోంది. పొన్నపల్లి, మాధవాయిపాలెం, స్టేషన్‌పేట, నందమూరి కాలనీ, 22వ వార్డు కొత్తకాలనీ, గ్రేస్ నగర్, వైఎస్సార్ నగర్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య ఇబ్బందులు ఎక్కువగా ఉన్నాయి. ఇక 29వ వార్డు అరుంధతీ పేటలో ఎక్కడ చూసినా చెత్తాచెదారం దర్శనమిస్తోంది. అపారిశుద్ధ్యం కారణంగా పట్టణవాసులు రోగాల బారిన పడుతున్నారు. స్టాక్షాత్తు మార్కెట్ ప్రాంతంలో కూడా రోడ్లపై చెత్త దర్శనమిస్తోందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుత వానాకాలంలో డ్రెయిన్స్ పరిస్థితి దారుణంగా ఉంది. ఇక ప్రధాన ప్రాంతాల్లో కూడా రోడ్డుపక్కన పిచ్చిమొక్కలు పెరిగిపోయి, దోమలు పెరిగిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

పారిశుద్ధ్య నిర్వహణలో లోపాలు

స్వచ్ఛ భారత్ అంటూ ఓ వైపు హడావిడి చేస్తున్న స్థానిక మునిసిపాలిటీ అధికారులు చెత్తసేకరణలో లోపాలు మాత్రం సరిద్దిడంలేదు. చెత్తసేకరణ విషయంలో లోపాలను సరిదిద్దితే పారిశుద్ధ్యం అంశంలో చాలా సమస్యలకు మోక్షం కలుగుతుందని పట్టణవాసులు చెబుతున్నారు. కానీ అధికారులు మాత్రం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. తడి చెత్త, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరిస్తామని, పారిశుద్ధ్య నిర్వహణలో కొత్త పంథాను తీసుకొస్తామని ఓ వైపు అధికారులు చెబుతున్నా అవన్నీ ఎప్పటికి కార్యరూపం దాలుస్తాయోననేది ప్రశ్నార్థకంగా నిలుస్తుంది. ప్రస్తుతం మునిసిపాలిటీలో శానిటరీ సెక్షన్‌లో 73 మంది పర్మినెంట్ వర్కర్లు, మరో 91 మంది కాంట్రాక్ట్ వర్కర్లు పని చేస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికుల హాజరు శాతంలో పెద్ద గోల్‌మాల్ జరుగుతుందనే ఆరోపణలు ఎప్పటి నుంచో వినిపిస్తున్నాయి. దీనిపై పురపాలకులు గానీ, అధికారులు గానీ నోరుమెదపని పరిస్థితి నెలకొంది. పారిశుద్ధ్య నిర్వహణలో శానిటరీ అధికారుల నిర్లక్ష్యం పూర్తిగా కన్పిస్తుంది. ముఖ్యంగా శానిటరీ మేస్త్రీల పనితీరు అధ్వానంగా ఉంది. తడి చెత్తను, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే విషయంలో ఇప్పటి వరకు ప్రజలకు సరైన రీతిలో అవగాహన కల్పించిన సందర్భం కూడా లేదు. పట్టణంలో ఏవార్డులో కూడా తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పట్టణంలో పారిశుద్ధ్య సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలని పట్టణ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

పశువుల దాణా పంపిణీ



పాడి రైతులకు పశువుల దాణా అందిస్తున్న అధికారులు

యలమంచిలి: వరద ప్రభావిత గ్రామాలైన కనకాయలంక, పెదలంక గ్రామాలలోని పాడి రైతులకు ఆదివారం పశు సంవర్థక శాఖ అధికారులు పశువుల దాణా పంపిణీ చేశారు. కనాకయలంక గ్రామంలో 128 మంది రైతుల వద్ద ఉన్న 480 పశువులకు పశువుకు 25 కిలోల చొప్పున 12 టన్నులు, పెదలంక గ్రామంలో 48 మంది రైతుల వద్ద ఉన్న 320 పశువులకు పశువుకు 25 కిలోల చొప్పున 8 టన్నులు వెరసి మొత్తం రూ.4.44 లక్షల విలువైన 20 టన్నుల పశువుల దాణా అందజేసినట్లు మండల పశు వైద్యాధికారి డాక్టర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కనకాయలంక, పెదలంక సర్పంచ్‌లు మద్దా శ్రీనివాసరావు, తాళ్ల నాగరాజు నాయకులు మామిడిశెట్టి పెద్దిరాజు, బొప్పన హరికిషోర్, ఆరుమిల్లి రామ శ్రీనివాస్, కడలి గోపాలరావు, పులి శ్రీరామమూర్తి, ముస్కుడి రాంబాబు పాల్గొన్నారు.

శ్రీనివాసరావు కవితకి ఎక్స్ రే అవార్డు



అవార్డు అందుకుంటున్న శ్రీనివాసరావు

పాలకొల్లు సెంట్రల్: విజయవాడకి చెందిన ఎక్స్ రే సాహిత్య సంస్థ ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన జాతీయ స్థాయి కవితల పోటీల్లో పాలకొల్లు రసధుని సాహితీ సంస్థ కార్యదర్శి, ప్రముఖ కవి, రచయిత మామిడిశెట్టి శ్రీనివాసరావు రచించిన 'గెలుపోటముల ఆట' అనే కవితకు ఉత్తమ కవితా అవార్డు వచ్చింది. ఈ పోటీలకు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి మొత్తం 358 కవితలు రాగా ఈ కవిత మూడో స్థానంలో నిలిచి అవార్డుకి ఎంపికైంది. ఆదివారం ఉదయం విజయవాడ స్వాతి బిల్డింగ్స్‌లో జరిగిన అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో కృష్ణా జిల్లా పూర్వపు కలెక్టర్ మహ్మద్ ఇంతియాజ్, డిప్యూటీ కలెక్టర్ కొమ్మెర్ల కృష్ణవేణి, ఎక్స్ రే సంస్థ అధ్యక్షులు కొల్లూరి, న్యాయ నిర్ణేత సర్వజిత్ చేతుల మీదుగా శ్రీనివాసరావు అవార్డు అందుకున్నారు.

క్రీడల్లో పేదలకు తోడ్పాటు అందించాలి



పడాల ప్రహ్లాద రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ నూతన కార్యవర్గ సభ్యులు

పెనుమంట్ర: పడాల ప్రహ్లాదరెడ్డి ఆశయ స్ఫూర్తి లక్ష్యంగా కమిటీ సభ్యులు చిత్తశుద్ధితో పని చేసి, క్రీడల్లో పేదలకు తోడ్పాటునివ్వాలని ప్రహ్లాదరెడ్డి మెమోరియల్ బాస్కెట్‌బాల్ ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు అల్లం బుల్లిరెడ్డి అన్నారు. ట్రస్ట్ సర్వసభ్య సమావేశం ఆదివారం మార్టేరు రోటరీ భవనంలో నరసాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ సత్తి సుబ్బన్న రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బుల్లి రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతానికి చెందిన ఎంతోమంది పూర్వ విద్యార్థులు క్రీడల్లో రాణించి ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్నత స్థితిలో ఉన్నారంటే ప్రహ్లాదరెడ్డి ఆనాడు విద్యార్థులకు ఇచ్చిన తర్ఫీదు కారణమన్నారు. అనంతరం సుబ్బన్న రెడ్డి మాట్లాడుతూ ఎస్వీజీ పాఠశాలలో క్రీడా ప్రాంగణాన్ని అభివృద్ధి పరిసపేద క్రీడ విద్యార్థుల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తూ సమ్మర్ క్యాంపులు నిర్వహణకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా మూడేళ్ల పాటు ఉండే ట్రస్ట్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుగా అల్లం బుల్లి రెడ్డి, సత్తి సుబ్బన్న రెడ్డిలతోపాటు నిర్వహణ కమిటీ అధ్యక్షుడిగా గుడిమెట్ల లక్ష్మారెడ్డి, కార్యదర్శిగా అల్లం భాస్కర్‌రెడ్డి ,కోశాధికారిగా గోలుగురు సత్యనారాయణ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా కడలి సుబ్రహ్మణ్యం తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విద్యుత్ షిఫ్ట్ ఆపరేటర్‌పై ఫిర్యాదు

యలమంచిలి: స్థానిక 11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా పని చేస్తున్న గుబ్బల జగదీష్ విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్నాడని వచ్చిన ఫిర్యాదుపై ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు ఎలక్ట్రికల్ ఏఈ వి చండీ కిరణ్ తెలిపారు. రెండు రోజుల క్రితం రాత్రి 12 గంటల సమయంలో యలమంచిలి, చించినాడ, కాజ గ్రామానికి వెళ్లే లైన్ ట్రిప్ అవ్వడంతో వినియోగదారులు ఫోన్ చేశారు. జగదీష్ ఫోన్ తీయకపోవడంతో లైన్‌మెన్ సబ్ స్టేషన్ వెళ్లారు. నిద్రపోతున్న జగదీష్ లేపి, లైన్ ట్రిప్ అయిన సంగతి అడగగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు. అయితే జగదీష్ గతంలో పలు మార్లు ఇదే విధంగా నిర్లక్ష్యంగా వ్యవహరించడని సిబ్బంది, వినియోగదారులు ఆరోపిస్తూ ఏఈకి ఫిర్యాదు చేశారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు ఏఈ పేర్కొన్నారు.

డంపింగ్ యార్డులుగా పంట కాలువ గట్లు

ఆకివీడు: పంట కాలువ గట్లు డంపింగ్ యార్డులకు నిలయాలుగా మారాయి. గ్రామీణ ప్రాంతాల్లోని పంట కాల్వ గట్లుపైనే గ్రామాల్లోని వ్యర్థాలు పారవేస్తున్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా వెంకయ్య వయ్యేరు పంట కాల్వ, ఉండి పంట కాల్వల వెంబడి వ్యర్థాలు పేరుకుపోయాయి. ఉండి పంట కాలువ గట్టుపై కలిసిపూడి, చెరుకువాడ, ఉండి, ఎన్నార్పీ అగ్రహారం తదితర గ్రామాల్లో వ్యర్థాలు గుట్టలుగా కనిపిస్తున్నాయి. వెంకయ్య వయ్యేరు పంట కాల్వ గట్టుపై స్థానిక పెద్ద వంతెన వద్ద, శ్రీరాంపురం, సంతపేట, అయిభీమవరం, చెరుకుమిల్లి తదితర గ్రామాల్లో గట్లపైనే చెత్త దర్శనమిస్తోంది. కంటి ముందు చెత్త కనిపిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గ్రామాల్లో జోరుగా నిమజ్జనోత్సవాలు



పెనుగొండ: వడలిలో చౌదరీస్ యూత్ ఆధ్వర్యంలో గ్రామోత్సవం చేస్తున్న దృశ్యం



పెనుగొండ: వడలిలో బాలల యూత్ ఆధ్వర్యంలో నిమజ్జనోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: గ్రామాల్లో గణపతి నిమజ్జనోత్సవాలు జోరుగా నిర్వహిస్తున్నారు. గణపతి నవరాత్రులు ఐదో రోజైన ఆదివారం పెనుగొండ మండలంలో నిమజ్జనాలకు గ్రామోత్సవాలు కనుల పండువగా నిర్వహించారు. ఉదయం నుంచి గణపతికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం తీన్ మార్ వాయిద్యాలు, సాంప్రదాయ వాయిద్యాలు, బుట్టబొమ్మల విన్యాలసాలతో గ్రామోత్సవం నిర్వహించారు. వడలిలోని వివేకానంద సర్కిల్ వద్ద బాలల యూత్ ఆధ్వర్యంలో ప్రత్యేకించి బాలల నిర్వహణలో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం వడలి కమ్మవారి వినాయకుడు ఆలయం వద్ద నుంచి చౌదరీస్ యూత్ ఆధ్వర్యంలో బాణాసంచా కాల్పులతో గ్రామోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం సిద్ధాంతం వశిష్ఠా గోదావరిలో నిమజ్జనం చేశారు.

నరసాపురంలో..

నరసాపురం రూరల్: గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఐదవ రోజైన ఆదివారం నరసాపురం మండలంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణపతి ప్రతిమలను ఊరేగించి, నిమజ్జనం చేశారు. చామకూరిపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన భారీ గణేష్ విగ్రహాన్ని వీధుల గుండా ట్రాక్టర్‌పై ఉంచి ఊరేగించారు. అలాగే మల్లవరం, కొప్పర్రు, తూర్పుతాళ్లు గ్రామాల్లో కూడా ఆదివారం వినాయకుని నిమజ్జనాలు చేశారు.

జుత్తిగలో..

పెనుమంట్ర: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన జుత్తిగ గ్రామంలో ఉన్న శ్రీ ఉమా వాసుకి రవి సోమేశ్వర స్వామి ఆలయ ఆవరణలో రెడ్డి యూత్ ఏర్పాటు చేసిన శ్రీ వరసిద్ధి లక్ష్మీగణపతి 14వ వార్షిక నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఐదో రోజు ఆదివారం శ్రీవిద్య గణపతికి విద్యార్థులతో వేద పండితులు వేమూరి వెంకటేశ్వర శర్మ అర్చకత్వంలో ఉదయం సామూహిక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఉత్సవ కమిటీ సభ్యుడు నల్లమిల్లి విజయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో యువతులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విద్యా గణపతికి రంగవల్లులతో మహా నివేదన సమర్పించారు. ముగ్గుల పోటీల్లో విజేతలను న్యాయ నాయనిర్ణేతల పరిశీలన అనంతరం ఓటింగ్ ద్వారా ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలను ఎంపిక చేసి బహుమతులను అందించారు.



నరసాపురం రూరల్: చామకూరిపాలెం వీధుల్లో గణపతిని ఊరేగిస్తున్న భక్తులు



పెనుమంట్ర: జుత్తిగ సోమేశ్వర ఆలయ ఆవరణలో రెడ్డి యూత్ ఏర్పాటు చేసిన గణపతి ప్రతిమ



పెనుమంట్ర: జుత్తిగలో శ్రీ విద్యా గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న విద్యార్థులు

వసుధ సేవలు అభినందనీయం

పాలకోడేరు: వసుధ ఫౌండేషన్ అందిస్తున్న సమాజ సేవ అభినందనీయమని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గరగపర్రు గ్రామంలో వసుధ వాత్సల్య కేంద్రం వద్ద ఆదివారం వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజు ఆధ్వర్యంలో కలెక్టర్ నాగరాణి చేతుల మీదుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన 21 సేవా సంస్థలకు రూ.28 లక్షలు చెక్కుల రూపంలో అందించారు. అంతేకాకుండా 11 మంది రోగులకు రూ.2.50 లక్షల నగదు అందించారు. ప్రతిభ కనబరిచిన 30 మంది పేద విద్యార్థులకు రూ.2.10 లక్షల ఉపకార వేతనంగా అందించారు. ఈ సందర్భంగా చైర్మన్ మంతెన వెంకటరామరాజు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు.

ఉచిత వైద్య శిబిరం

భీమవరం: అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్టు ఆధ్వర్యంలో మెంటేవారితోటలోని ట్రస్టు కార్యాలయంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తొలుత ముఖ్య అతిథిగా పాల్గొన్న వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరంలో సేవలు అందిస్తున్న వైద్యులు వి. శ్రీనివాసరావు, దాట్ల కృష్ణంరాజు, వలంటీర్లకు, మెడికల్ రిప్స్‌కు అభినందనలు తెలిపారు. ఈ శిబిరంలో బీపీ, సుగరు, ఫిట్స్, పెరాలసిస్ వంటి వ్యాధులకు వైద్య సేవలు అందించారు.

నిబద్ధతతో పనిచేసిన ఉద్యోగులకు గుర్తింపు

భీమవరం (ప్రకాశంచౌక్): నిబద్ధతతో పనిచేసిన ఉద్యోగులకు నిరంతరం గుర్తింపు ఉంటుందని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా ఏర్పడిన పశ్చిమగోదావరి జిల్లా భీమవరం కలెక్టర్ కార్యాలయంలో ల్యాండ్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన సీహెచ్ రవికుమార్‌ను కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావే మందిరంలో శనివారం రాత్రి కలెక్టర్ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్వో బి.శివన్నారాయణ రెడ్డి దుశ్శాలువాతో సత్కరించారు.

శిథిలావస్థలో బాపూజీపురం వంతెన



పెనుగొండలోని బాపూజీ పురం వంతెన

పెనుగొండ: పెనుగొండ బాపూజీ పురం కాలిబాట వంతెన శిథిలావస్థకు చేరుకుంది. ఊడిపోయిన రెయిలింగ్‌లతో ప్రమాదకరంగా మారింది. పెనుగొండ శివారు బాపూజీ పురం వద్ద నరసాపురం కాలువపై 2001లో ఈ కాలిబాట వంతెన నిర్మించారు. ఇటు రైతాంగం, అటు బాపూజీపురం వాసులు కాలిబాట వంతెనపైనే రాకపోకలు సాగిస్తుంటారు. వాహనాలు రాకపోకలకు మాత్రం కిలో మీటరుకు పైగా పూర్తిగా అధ్వానంగా ఉన్నా కాలువ గట్టుపైనే వెళుతుంటారు. కాలిబాట వంతెనకు సైతం ఎన్నో ఏళ్లు పోరాటం చేయగా, 2001లో వంతెన నిర్మించారు. అయితే అప్పటి నుంచి కనీస మరమ్మతులు చేయకపోవడంతో వంతెన ఎగువ, దిగువ భాగంలో సరైన అప్రోచ్ లేకపోవడంతో తరచూ ప్రమాదాలకు గురవతున్నారు. ఈ ప్రాంతంలో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా నేరుగా కాలువలోకి దూసుకువెళ్లే ప్రమాదం ఉంది. కాబట్టి బాపూజీపురం వైపు చిన్నపాటి గోడ నిర్మించి రక్షణ కల్పించారు. అయితే, దాదాపుగా 25 ఏళ్లు దాటుతుండడంతో వంతెన రెయిలింగ్ కూడా శిథిలావస్థకు చేరుకుంది.

ఎక్కడికక్కడ ఊడిపోయిన రెయిలింగ్

ఈ వంతెనపై ఎక్కడికక్కడ ఇనుప ఊచలు బయటకు చొచ్చుకు వచ్చి దర్శనమిస్తున్నాయి. అదేవిధంగా వంతెన ఎక్కుతున్నపుడు నాలుగైదు మీటర్లు మేర రెయిలింగ్ ఊడిపోయింది. దీంతో పాటు మలుపులోనూ రెయిలింగ్ సగభాగం కూలిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రెయిలింగ్ మరమ్మతులు చేపట్టలంటూ గత కొన్నేళ్లుగా బాపూజీపురం వాసులు ఎన్నో సార్లు విజ్ఞప్తి చేశారు. అయినా పట్టించుకొన్న నాథుడే కరువయ్యాడు. రాత్రి వేళల్లో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతం గురించి తెలియని వారు అదుపు తప్పి పడిపోతున్నారని వాపోయారు. ఇదిలా ఉండగా, వంతెన దిగువలో గుబురు పొదలు వ్యాపించడంతో సగ భాగం మొక్కలు ఆవరించి. రాత్రి వేళల్లో ఇబ్బందులు పాలు చేస్తున్నాయని వివరించారు. ఎదురెదురుగా వచ్చే మోటారుసైకిళ్లు తప్పించబోయి రెయిలింగ్‌పై పడుతుండడంతో బయటకు వచ్చిన ఊచల వల్ల గాయాలవుతున్నాయని వాపోతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఈ వంతెనకు కనీస మరమ్మతులు చేపట్టాలని బాపూజీపురం వాసులు, రైతులు కోరుతున్నారు.



ప్రమాదంగా మారిన ఊడిపోయిన రెయిలింగ్



మలుపులో ప్రమాదకరంగా ఉన్న దృశ్యం